

"వరండాలోకి వచ్చి నిలబడొద్దని నీ కెన్నిసార్లు చెప్పాలి? అయ్యగారితో మాట్లాడవల్సిం దేమన్నా ఉంటే గేటు దగ్గర నిలబడి మాట్లాడు !" మల్లయ్యని కసురుకుంది శివరామయ్య భార్య.

గాదెల్లో ధాన్యం నింపడానికి ఇంట్లోకి వడ్ల బస్తాలు మోసుకొచ్చినప్పుడు, పట్నం నుంచి బీరువా తెచ్చి ఇంట్లోకి చేర్చినప్పుడు, ఇంటి పైకప్పు మార్చినప్పుడు ఇల్లంతా తిరిగినప్పుడు లేని అభ్యంతరం అమ్మగారికి ఇప్పుడెందు కొచ్చింది? - తనలోనే గొణుక్కున్నాడు.

ఎదురుతిరిగి మాట్లాడలేదు. మాట్లాడితే గంజిలోకి నూక లివ్వరు. నంజుకోవడానికి పచ్చడి ఇవ్వరు, పాత చీర పెళ్ళానికి పడేయ్యరు. ఎందుకులే పేచీలు?

ఈ రోజేమన్నా కొత్త? తాతముత్తతల నాటినుంచి మల్లయ్య కుటుంబం శివరామయ్య పొలం పనులు, ఇంటి పనులు చేస్తూనే ఉన్నారు.

శివరామయ్య ఇంట్లోనుంచి బయటకొచ్చాడు లంకపుగాకు చేత్తో పట్టుకుని.

"ఏమిట్రా ! ఇక్కడ నిలబడ్డావ్ ! పశువుల సావిడి బాగు చేశావా?"

"గొడ్ల దగ్గర రొచ్చంతా తీసేసి, మేత వేసి వచ్చానండీ !"

"ఇంకా నిలబడ్డా వెందుకు? ఇంటి కెళ్ళు. పొద్దుపోయింది. పొగాకు కాడ కావాలా?" అంటూ పొగాకు పాయ తీసి మల్లయ్యవైపు విసిరేశాడు.

శివరామయ్యదీ, మల్లయ్యదీ ఒకే వయస్సు. అరవయ్యేళ్ళుంటాయి. శివరామయ్య తండ్రి దగ్గరే మల్లయ్య తండ్రి పని చేసింది. తండ్రితో పాటే వచ్చేవాడు మల్లయ్య. మొదట్లో శివరామయ్య, మల్లయ్య కలిసి ఆడుకునేవారు. వాళ్ళిద్దరూ కలిసి ఆడుకోవడం చూసినప్పుడల్లా శివరామయ్య తల్లి చిందులు తొక్కేది. మల్లయ్యతో కలిసి తిరగొద్దని నూరిపోసేది. పెద్దవాడయ్యాక పొలం, ఇల్లు చూసుకుని శివరామయ్య మురిసేవాడు. పొలం పనులు చేసుకుని బతికే మల్లయ్య అతనికి అల్పజీవిలా కనిపించేడు. ఆస్తి పెరిగేక మల్లయ్య మరీ పురుగులా కనిపించేడు. తా నేదో ఏనుగు అంబారీ మీద కూర్చున్నట్లు అనుభూతి చెందేవాడు శివరామయ్య.

మల్లయ్యకు శివరామయ్య మీద కోపం లేదు. తనను కాళ్ళకింద పడవేసి తొక్కుతూ, శివరామయ్యని అంబారీ మీద కెక్కించుకున్న మదపుటేనుగుమీదే కోపం.

"తన కోపమె తన శత్రువు" అంటూ ఏదో నీతివాక్యం మల్లయ్యను చప్పబడేటట్లు చేసింది.

అరగంట గడిచేక గాని మల్లయ్య గొంతు పెగిలింది కాదు.

"ఇంట్లో గడవడం కష్టంగా ఉందండి ! ఒకపూట వన్తు ఉంటుంది, వన్తుందండి. పిల్లలు ఆకలికి నకనకలాడుతున్నారు. మా పెద్దోడికి పనులు దొరకడంలేదు. పొలం పనులు నంవత్సరంలో ఏ మూడు నెలలో ఉంటాయి. మిగతా రోజులన్నీ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాల్సిందే. కరువుకాటకాలొచ్చి ఆమాత్రం పొలం పనులు కూడా దొరకడంలేదు. ఓ వంద రూపాయలు ఇప్పించండి. మావాడు పనిలోకి వెళ్ళగానే మీ బాకీ తీర్చేస్తా !"

పనులు చేసేటప్పుడు మల్లయ్య రామభక్తుడు హనుమంతుడిలా కనిపిస్తాడు శివరామయ్యకి. డబ్బు అడిగినప్పుడు రావణాసురుడిలా కనిపిస్తాడు.

"ఇప్పటికే పది వేలకు పైగా బాకీ ఉన్నావ్. నువ్వు చచ్చిపోయేదాకా పన్జేసినా ఆ బాకీ తీరదు. ఎప్పుడూ డబ్బులు కావాలన్న మాటే గాని, 'ఇదిగో ఈ వంద ఉంచండి బాకీకింద' అన్న మాట ఎప్పుడన్నా అని ఏడ్చావట్రా? నువ్వు పని చెయ్యలేకపోతే మీ వాడిని పనిలోకి పంపు. డబ్బులు మాత్రం అడక్కు !

# అంత్యక్రియలు

అలపర్తి రామకృష్ణ

ఇక్కడ దూపాయిల చెట్లు ఏం లేవు" అనేసి మళ్ళీ లోపలకి వెళ్ళిపోయాడు శివరామయ్య.

మరో గంట గేటు దగ్గరే నిలబడ్డాడు మల్లయ్య ఏదో ఆశతో. శివరామయ్య బయటకొచ్చి ఓ వదన్నా ఇవ్వకపోతాడా నన్న ఆశే అతన్ని శిలావిగ్రహంలా అక్కడే నిలబెట్టింది. లోపల శివరామయ్య నిద్రకు ఉపక్రమించేడు.

ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు శివరామయ్య కొడుకు వీరభద్రం. ఎవరూ చూడకుండా నంచిలో బియ్యం పోనుకువచ్చి మల్లయ్యకు ఇచ్చేడు.

వీరభద్రాన్ని మనస్సులోనే దీవించేడు మల్లయ్య.

** ** **

శివరామయ్య చనిపోయాడు.

ఓ నక్షత్రం రాలిపోయినట్లుగా, వటవృక్షం కూలిపోయినట్లుగా ఊళ్ళో వాళ్ళంతా బాధపడ్డారు.

కొత్త ఉత్తరీయం కప్పి చావమీద పడుకోబెట్టారు.

అగరొత్తుల, అత్తర్ల వానన ఆ ప్రాంతమంతా గుప్పుమంటూంది.

పాత బాకీ వసూళ్ళకని రెండు మైళ్ళ దూరంలో ఉన్న మరో గ్రామానికని బయలుదేరాడు శివరామయ్య ఊరిబయట శివాలయం దగ్గర నిలబడి దేవుడికి దణ్ణం పెట్టుకోవడం, కాలువగట్టు మీదుగా నడిచి వెళ్ళడం నలుగురైదుగురు చూశారు.

ఆ తర్వాత మూడు రోజులు గడిచినా ఆయన జాడ తెలియలేదు.

ఉదయాన బయలుదేరి ఎన్ని పనులున్నా చీకటి పడకముందే ఇంటికి చేరుకునే మనిషి మరునటి రోజు కూడా రాకపోయేనరికి ఇంట్లో వాళ్ళకి కంగారు ఎక్కువైంది. ఆయన వెళ్తానన్న ఊరికి మనిషిని పంపించేరు. ఊళ్ళో లేరు శివరామయ్య.

చివరికి కాలువలో ఉబ్బిపోయిన శవం కన్పించింది. గుర్తుపట్టటానికి వీల్లేనట్లుగా ఉంది శవం. కాలికి ఉన్న రాగి కడియం, మెడ దగ్గర గాయం తాలూకూ మచ్చ చూసి గుర్తుపట్టేరు.

శవం పక్కన కూర్చుని శోకాలు పెడుతూవుంది శివరామయ్య భార్య.

నిర్లిప్తంగా ఎటో చూస్తూ కూర్చున్నాడు శివరామయ్య కొడుకు వీరభద్రం.

అంత్యక్రియల ఏర్పాట్లు చురుగ్గా సాగిపోతున్నాయి.

చుట్టుపక్కల గ్రామాల నుంచి చూడటానికి వచ్చిన వాళ్ళు వీరభద్రాన్ని పలకరిస్తూ ఉన్నారు. సానుభూతి వర్షం కురిపిస్తున్నారు.

వీరభద్రం దృష్టి మల్లయ్య కొడుకు మీద పడింది.

స్తంభానికి అనుకుని కళ్ళు తుడుచుకుంటూ కన్పించేడు. దుఃఖాన్ని అణచుకునే ప్రయత్నం చేస్తున్నాడు గాని, అతని వల్ల కావడం లేదు. పార్లి, పార్లి ఏడుస్తున్నాడు.

వీరభద్రానికి ఆశ్చర్యమేసేసింది. తన తండ్రి చనిపోతే అత నెందు కలా బాధపడుతున్నాడు. తండ్రితో అంతటి అనుబంధం ఉందా?

అంతిమ యాత్ర ఆర్భాటంగా మొదలయ్యింది. శవంపైన పూల జల్లులు కురిపించారు. కడవటి వీడ్కోలు చెప్పారు చెమర్చిన కళ్ళతో.

అంతిమయాత్ర ఏర్పాట్లు చూసి తృప్తిపడ్డాడు మల్లయ్య కొడుకు

శవం వెనుక ఆరాధనా భావంతో నడుస్తున్న మల్లయ్య కొడుకును చూడగానే ఏదో అనుమానం వచ్చింది వీరభద్రానికి. ఖననం పూర్తయ్యాక గాని మల్లయ్య కొడుకుతో మాట్లాడటానికి వీలుపడలేదు.

"ఎందుకలా విపరీతంగా బాధ పడుతున్నావ్?" వీరభద్రం అడిగేడు.

"మా అయ్య చనిపోతే దుఃఖం రాదూ?" అన్నాడు వాడు నింపాదిగా.

"మీ నాన్నా? నిజంగా?"

"మీరు గుర్తుపట్టలేకపోయారు. శివరామయ్యగారూ, మా నాన్నే ఇంచుమించుగా ఒకేరకంగా ఉంటారు. కాలువలో కాలు జారి పడింది, చనిపోయింది మా నాన్నే అని నాకు తెలును. ఆ శవాన్ని ఇంటికి తీసుకురావడానికి ధైర్యం చాల్లేదు. చేతిలో చిల్లిగవ్వలేదు. మా వాళ్ళందరికీ తాగించాలి, తిండిపెట్టాలి. ఆ శవాన్ని గుర్తుపట్టి కూడా మెదలకుండా ఉండిపోయాను. మా నాన్న కాలికి కూడా రాగి కడియం, మెడ దగ్గర మచ్చ ఉన్నాయి. ఇన్నేళ్ళు మీ దగ్గర పని చేసినా మీరు గమనించలేదు. అనుకోకుండా ఆ శవం మీ నాన్నగారిదని భ్రమపడ్డారు. మా నాన్న బ్రతికిండగా సుఖపెట్టలేకపోయాను. చనిపోయేక నన్నా సుఖపెడదామనుకున్నాను. అంత్యక్రియలు ఏ లోపం లేకుండా చేశారు. ఇప్పుడు మీరు ఎన్ని తిట్లూ, శాపనార్థాలూ పెట్టినా పరవాలేదు" - అన్నాడు మల్లయ్య కొడుకు.

వీరభద్రం ఆలోచనలో పడ్డాడు. ఈ విషయం ఇంట్లో చెప్పాలా, వద్దా అని సందిగ్ధంలో పడ్డాడు.

దూరంగా శివరామయ్య కేకలు విన్పించేయి.

తండ్రి గొంతు వినగానే వీరభద్రం మనస్సు తేలికపడింది.

"మీ కుటుంబం మొదట్నుంచి మాకు సేవలు చెయ్యడమే గాని ప్రతిఫలం ఆశించలేదు. మీ నాన్న అంత్యక్రియలు చేసి ఋణంలో కొంత భాగమైనా తీర్చుకోగలిగాం.. ఇక ముందు మీ బాగోగులు చూసే బాధ్యత నాది" అన్నాడు వీరభద్రం మల్లయ్య కొడుకు భుజం మీద చెయ్యి వేసి.

శివరామయ్య వచ్చాడు అక్కడికి.

"నేను చచ్చా ననుకుని ఎవడో దిక్కుమాలిన వాడికి అంత్యక్రియలు చేశారన్నమాట. బతికుండగానే నాకు కర్మకాండలు జరిపించేశారు. చిన్ననాటి స్నేహితుడు బలవంతం చేసి వాళ్ళ ఊరు తీసికెళితే, మీ రిక్కడ మన పరువు మంటకలిపేశారు. శవాన్ని సరిగ్గా చూసుకోవడం లేదా? దిక్కుమాలిన శవాన్నిటికీ దహన సంస్కారం చెయ్యడమేనా?" కొడుకు మీద విరుచుకుపడ్డాడు.

ఒక్కసారిగా పగలబడి నవ్వేశాడు వీరభద్రం.

"బాకీలు వసూలు చెయ్యడానికి నువ్వెళ్ళావ్! ఇక్కడ మన బాకీ నేను తీర్చేశాను" అన్నాడు స్పష్టంగా.

వీరభద్రం మాటలు శివరామయ్యకు అర్థం కాలేదు. ■

